క్లుప్తంగా

అమ్మవారి సహస్ర నామ పుస్తకాల పంపిణీ



తాడిపర్రు వాసులకు గోగులమ్మ జాతర క్యాలెండర్లు అందిస్తున్న వెంకటేశ్వరరావు

నిడదవోలు రూరల్: ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామదేవత గోగులమ్మతల్లి జాతర మహోత్సవంలో భాగంగా ఈ గ్రామానికి చెందిన గోదావరి ప్రింటర్స్ అధినేత నిడదవోలు వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో రెండు వేల అమ్మవారి సహస్రనామ పుస్తకాలు, 1500 అమ్మవారి చిత్రాలతో కూడిన ఫొటోలు, క్యాలెండర్లను గ్రామంలో ప్రతి ఇంటా సోమవారం పంపిణీ చేశారు. గోగులమ్మతల్లి పూరి గుడిసెకు వద్ద జాతర కమిటీ ఆధ్వర్యంలో వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.నరేంద్రబాబు, కమిటీ నిర్వాహకులు వాకలపూడి సత్యనారాయణ, కాకరపర్తి సూర్యచంద్రరావు, గారపాటి వెంకట చిన్నారావు, అంద్రోతు వెంకటేశ్వరరావు, కాపా భద్రం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థికి సన్మానం



రాజేష్‌కు ఫైబర్ రాకెట్, స్పోర్ట్స్ షూ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నిడదవోలు రూరల్: అండర్–14 బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పురుషోత్తపల్లి జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి జి.రాజేష్‌ను ఆ పాఠశాల 1991–92 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు సోమవారం సన్మానించారు. రాజేష్‌కు పూర్వ విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ ఫైబర్ రాకెట్, స్పోర్ట్స్ షూతో పాటు జ్ఞాపిక అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డీఏవీఎస్ ప్రసాద్, పీడీ పాలేటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీపర్రు - ఉండ్రాజవరం రోడ్డుకు మరమ్మతులు



రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

నిడదవోలు రూరల్: పెరవలి మండలం తీపర్రు వంతెన నుంచి తాడిపర్రు మీదుగా ఉండ్రాజవరం లూథరన్ చర్చి వరకూ ఆర్ అండ్ బీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తాడిపర్రులో ఈనెల 17న గోగులమ్మ అమ్మవారి జాతర నిర్వహిస్తారు. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడిని ఇటీవల వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు కోరారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్పందనకు మూడు అర్జీలు

నిడదవోలు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం క్రమం తప్పకుండా స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందని నిడదవోలు తహసీల్దార్ ఎం.గంగరాజు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో రేషన్ కార్డు, పింఛను కోసం ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టైర్ల ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

నల్లజర్ల: ఆవపాడు శివార్లలోని ఓం సాయి ఇండస్ట్రీస్ అనే టైర్ల ఫ్యాక్టరీలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రస్తుతం ఈ ఫ్యాక్టరీ మరమ్మతుల్లో ఉంది. గ్యాస్‌ను మరొక సిలిండర్‌లోకి మారుస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్టు తాడేపల్లిగూడెం అగ్నిమాపక శాఖాధికారి జీవీ రామారావు తెలిపారు. ప్రమాద సమాచారం అందగానే ఆయన తమ సిబ్బందితో వచ్చి వాటర్‌తో పాటు ఫోమ్ వినియోగించి మంటలను అదుపు చేశారు. దాంతో పరిసర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు రూ.లక్ష వరకూ ఆస్తినష్టం జరిగినట్టు అంచనా. ఈ ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోనే ఆరోమా ఆల్కహాల్ ఫ్యాక్టరీ ఉంది. అక్కడ ఆల్కహాల్‌తో నింపిన ట్యాంకర్లు ఉన్నాయి. ప్రమాద వార్త తెలియగానే తహసీల్దార్ మక్బూల్ ఆలీ, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

స్పందనకు పది అర్జీలు

కొవ్వూరు: స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పది అర్జీలు అందాయని ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. ముగ్గురు పింఛను మంజూరు చేయాలని, ఇద్దరు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఐదుగురు భూసంబంధిత సమస్యలపై అర్జీలు సమర్పించారన్నారు.

గప్‌చుప్‌గా సైబర్ నేరాలు

- బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము మాయం
- లబోదిబోమంటున్న ఖాతాదారులు
- నల్లజర్ల మండలంలో వెలుగులోకి పలు ఉదంతాలు



నల్లజర్ల: తన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఖాతా నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.16 వేలు కాజేశారంటూ మండలంలోని అనంతపల్లికి చెందిన చిరు వ్యాపారి మేడిది హనక్‌బాబు వాపోయారు. జనవరి 28న రూ.10 వేలు, 29న రూ.6 వేలు ఆయన ఖాతా నుంచి ఎవరో విత్‌డ్రా చేశారు. ఈ విషయాన్ని ఎస్‌బీఐ నల్లజర్ల శాఖ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా, అందుకు సంబంధించిన స్టేట్‌మెంట్ కాపీ ఇచ్చారు. దానిని తీసుకొని నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు. గత వారం గంటావారిగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఇమ్మణ్ణి సత్తిపండు ఎస్‌బీఐ నల్లజర్ల శాఖలోని ఆయన ఖాతా నుంచి రూ.20 వేలు ఆయన ప్రమేయం లేకుండానే ఎవరో తీసేసుకున్నారు. ఇండియన్ బ్యాంకు పోతవరం శాఖ నుంచి కూడా ఇదే తరహాలో బొల్లిన రామకృష్ణ ఖాతా నుంచి రూ.39 వేలు స్వాహా చేశారు. దీనిపై ఆయన పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. దూబచర్లకు చెందిన మరో వ్యక్తి ఖాతా నుంచి కూడా సొమ్ము పోయినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది.

ఇలా దోచేస్తున్నారు

ఖాతాదారుల ప్రమేయం లేకుండానే నగదు ఉపసంహరణతో సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెర తీశారు. ఇంతకు ముందు ఖాతాదారులకు ఫోన్లు చేసి ఓటీపీ నంబర్లు, లింక్‌లు, పాస్‌వర్డ్‌లు తెలుసుకుని, వాటి సాయంతో వారి బ్యాంకు ఖాతాల్లోని నగదును మాయం చేసేవారు. తాజాగా బ్యాంక్ ఖాతాదారుల ఆధార్ నంబర్, వేలిముద్రల ఆధారంగా దోపిడీ చేస్తున్నారు. దాంతో ఖాతాదారులకు తెలియకుండానే వారి ఖాతాలోని సొమ్ములు మాయం అవుతున్నాయి. సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చినపుడో, బ్యాలెన్స్ చెక్ చేసుకున్నపుడో తప్ప జరిగిన మోసం తెలియడం లేదు. ఇటీవల ఇటువంటివి బాగా పెరిగిపోయాయి.

వేలిముద్రలు ఉపయోగించి..

ఖాతాదారుల వేలిముద్రల సాయంతో సైబర్ నేరగాళ్లు అక్రమంగా నగదు విత్ డ్రా చేస్తున్నట్టు బ్యాంకు అధికారులే చెబుతున్నారు. ఖాతాదారులు ముందుగా తమ ఆధార్ బయోమెట్రిక్‌ను లాక్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆధార్ నమోదుకు, సంక్షేమ పథకాలు, భూముల క్రయ,విక్రయాలు, మొబైల్ సిమ్ కార్డులు పొందేందుకు వేలిముద్రల నిర్ధారణ తప్పనిసరి. సైబర్ నేరగాళ్లు సంబంధిత డేటా దొంగిలించి వేలిముద్రలను క్లోనింగ్ చేస్తున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సిలికాన్‌తో ఫింగర్ ప్రింట్లు తయారు చేస్తున్నట్టు సమాచారం. బాధితులు ఇటీవల భూక్రయ, విక్రయాలు జరిపినపుడు వేసిన వేలిముద్రల ఆధారంగానే వారి ఖాతాల నుంచి సొమ్ము మాయం అయినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పోతవరం బాధితుడు బొల్లిన రామకృష్ణ గత నెలలో అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేలిముద్ర వేసినట్టు చెబుతున్నారు. ఆధార్ అనుసంధానం అయిన బ్యాంకు ఖాతాదారుల నుంచి సొమ్ములు ఎక్కువగా పోతున్నట్టు చెబుతున్నారు. అది కూడా రూ.5 వేలు, రూ.10 వేలు, 15వేలు, 20 వేల మొత్తాలనే కాజేస్తున్నట్టు గుర్తించారు. రోజురోజుకూ ఇలాంటి బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఖమ్మంలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసి అనంతపల్లికి వచ్చిన మంచిరాజు కోటేశ్వరరావు అనే రిటైర్డ్ ఉద్యోగి ఖాతా నుంచి కూడ రూ.20 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారు.

అప్రమత్తతే రక్ష..

- బ్యాంకు ఖాతాదారులు తమ ఆధార్ నంబర్ ఇవ్వాల్సి వచ్చినపుడు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి.కేంద్ర ప్రభుత్వ తాజా ఆదేశాల మేరకు చివరి నాలుగు అంకెలు మాత్రమే ఇవ్వడం శ్రేయస్కరం.
- బ్యాంకు ఖాతాల్లో బ్యాలెన్స్‌ను తరచూ పరిశీలిస్తుండాలి. సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడం ఆలస్యం కావచ్చు. నేరం జరిగిన వెంటనే స్పందిస్తే బ్యాంకు అధికారులు చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. పెద్ద మొత్తాలను బ్యాంకులో దాచుకునేటపుడు జాయింట్ అకౌంట్ తెరిస్తే ఇలాంటి సైబర్ నేరాలు జరిగే అవకాశాలు తక్కువ.
- నగదు అవసరం అయినపుడు నేరుగా బ్యాంకు నుంచే తెచ్చుకుంటే ఇబ్బంది ఉండదు.
- సాంకేతిక అభివృద్ధి పెరుగుతున్నకొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో దోపిడీ మార్గాలు అన్వేషిస్తున్నారు. స్వీయ అప్రమత్తతే రక్ష అని నిపుణులు చెబుతున్నారు.

సంక్షేమ ప్రదాతకు మళ్లీ పట్టం కట్టండి

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు 15వ వార్డులో గడప గడపకూ..



కొవ్వూరు 15వ వార్డు వాసుల సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత



ప్రకాశరావుపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన పేదలందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ సుపరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కోరారు. పట్టణంలోని 15వ వార్డులో సోమవారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆ వార్డులోని ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఎంత మేర లబ్ధి చేకూరిందో అంకెల వారీగా వివరించారు. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ వారి సమస్యలను మంత్రి వనిత అడిగి తెలుసుకున్నారు. నాయకులు ప్రమేయం లేకుండా, ఎవరి సిఫార్సులు అవసరం లేకుండానే అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్రోతు అంజనీదేవి, 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, రష్మిత దంపతులు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు రుత్తల భాస్కరరావు, సుంకర సత్యనారాయణ, పార్టీ నాయకులు చౌటుపల్లి వీరన్న, చీరా వెంకటరమణ, వరిగేటి సుధాకర్, వేములపల్లి గోపి, బోడపాటి హనుమంతరావు, గుర్రే శరత్, పల్లి రామకృష్ణ, రాచర్ల రవీంద్ర, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు సలాది వాసు, పార్టీ చాగల్లు మండలశాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, కౌన్సిలర్లు తోట లక్ష్మీప్రసన్న, చీరా అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వింటూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

నల్లజర్ల: గడప గడపకూ వెళుతూ ఒకపక్క ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, మరోపక్క జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరిస్తూ తానున్నానంటూ భరోసా ఇచ్చారు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు. మండలంలోని ప్రకాశరావుపాలెంలో రెండో రోజు సోమవారం కూడా ఆయన గడప గడనకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ జాన్ విక్టర్, కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు, ముత్తిన నాని, ముత్తిన నరేష్, కరుటూరి అచ్యుత రామయ్య, మట్టా లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 9, 10, 11, 12 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలను సావధానంగా ఆయన విన్నారు. వాటన్నింటిని పరిష్కరించాలని వెంట ఉన్న అధికారులను ఆదేశించారు.

అర్హతే ప్రామాణికం..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా అందిస్తున్న పథకాలకు కేవలం అర్హతే ప్రామాణికమని ఎమ్మెల్యే తలారి అన్నారు. సంక్షేమ పథకాలు పొందుతూ ప్రతి ఇంట్లో పేదలు ఆనందంగా ఉన్నారన్నారు. కనీవినీ ఎరగని రీతిలో సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఇంట్లో పెద్ద కొడుకుగా భావిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ మేలు చేస్తున్న సీఎం జగనన్నను రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. బోయపాటి సుబ్బారావు పొలం నుంచి కంతమణి బాబూరావు పొలం వరకు, దుద్దుపూడి బుచ్చయ్య పొలం నుంచి కరుటూరి సురేష్ పొలం వరకు, కంబాలమ్మ చెరువు నుంచి ఆలపాటి సాయిబాబా పొలం వరకు, శ్మశానవాటిక నుంచి యద్దనపూడి బోణయ్య పొలం వరకు, కల్కి భగవాన్ గుడి నుంచి దావులూరి మురళి పొలం వరకూ పుంత రహదారులను అభివృద్ధి చేయాలని ఆ ప్రాంత రైతులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అచ్యుతశివాజీ, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ నాయకులు బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, తాతిన కాశీ, చటారి ఏసు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ
- డివిజన్‌లో 484 మంది బైండోవర్
- ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వర్మ స్వాధీనం చేసుకున్న కత్తులు

కొవ్వూరు: కోడి పందేల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు. కొవ్వూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో సోమవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లో కోడిపందేలు, పేకాట, కోతాట, కోడి పందేల నిర్వాహకులు, కోళ్లకు కత్తులు కట్టే వారు 484 మందిని ఇప్పటి వరకూ బైండోవర్ చేసుకున్నామన్నారు. తాళ్లపూడి, చాగల్లు మండలంలోని మార్కొండపాడు, కొవ్వూరు మండలంలోని వాడపల్లి, తోగుమ్మి, వేములూరు, సీతంపేట, మద్దూరు, మద్దూరులంక గ్రామాల్లో కోడి పందేలు జరగకుండా చూడాలంటూ కొందరు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అందుకనుగుణంగా కోర్టు నుంచి పోలీసులకు ఆదేశాలు కూడా అందాయని వర్మ చెప్పారు. పట్టణ శివార్లలోని నందమూరు రోడ్డు సమీప పొలాల్లోని కోడి పందేల స్థావరంపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారన్నారు. రెండు కోడి పుంజులు, రెండు కత్తులు, రూ.26,130 నగదు స్వాధీనం చేసుకుని, ఒకరిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

రెవెన్యూ, పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాలు

కోడి పందేల నియంత్రణకు రెవెన్యూ, పోలీసులతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ వర్మ తెలిపారు. తోగుమ్మిలో ఉప్పులూరి భాస్కరరావు వద్ద 106 కత్తులను, అదే గ్రామానికి చెందిన చదలవాడ వంశీ వద్ద 20 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. గ్రామాల్లో సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటామన్నారు.పేకాట, గుండాట, కోడి పందేల వంటి జూదక్రీడల నివారణకు ప్రజలు పోలీసులతో సహకరించాలని కోరారు. ఇప్పటికే కోడిపందేలు నిర్వహించే ప్రదేశాలను గుర్తించి నిఘా పెట్టామన్నారు. రూరల్ సీఐ వైవీ రమణ, రూరల్ ఎస్సై జి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యువత దూరంగా ఉండాలి

గోపాలపురం: యువత కోడి పందేల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు సూచించారు. కోడి పందేలు, జూదాల నిర్వహణకు వ్యతిరేకంగా స్థానిక పెద్దగూడెంలో సోమ వారం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి పందేలు నిర్వహించినా, ఆడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.బాలాజీ, గోపాలపురం ఎస్ఐ కొరివి రామకృష్ణ, సర్పంచ్ పైడి శిరీష, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వారా రామ సంగీత పాల్గొన్నారు.

తాళ్లపూడి: కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె. వెంకటరమణ హెచ్చరించారు. కోడిపందేలకు వ్యతిరేకంగా మండల టీమ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. కోడి పందేల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై తహసీల్దార్ టి.రాధిక, ఎస్సై వెంకటరమణ చర్చించారు. సమావేశంలో ఏఎస్‌వో జె. వెంకటేశ్వరరావు, మానవత సంస్థ రీజనల్ వి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

145 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో 145 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రి వైద్య సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంక జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, సర్పంచ్ పల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హమాలీల నిరసన

చాగల్లు: ఊనగట్లలోని సివిల్ సప్లయ్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద హమాలీలు సోమవారం నిరసన తెలిపారు. కూలీ రేట్లను పెంచాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన వారీ ఆందోళన చేశారు.సీఐటీయూ నాయకులు జువ్వల రాంబాబు, గంటి కృష్ణ, క్రాంతి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

చాగల్లు: మీనానగరంలో ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందిన మెడవంపుల వీరయ్య కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో తక్షణ సహాయంగా రూ.10 వేలు అందజేశారు. వీరయ్య కుటుంబ సభ్యులకు సోమవారం ఈ మొత్తాన్ని సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి చేతుల మీదుగా అందజేశారు. బీమా పథకంలో రూ.5 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వేళ్లచింతలగూడెంలో కబడ్డీ పోటీల ప్రారంభం

గోపాలపురం: క్రీడల్లో బాగా రాణించే యువతకు ఉద్యోగావకాశాలు మెండుగా లభిస్తాయని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని వేళ్లచింతలగూడెంలో నిర్వహించే మహిళల, పురుషుల కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. రంగారావు మధుకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. పార్టీలకు అతీతంగా రాష్ట్ర స్థాయిలో క్రికెట్, కబడ్డీ, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ సంక్రాంతి శోభ తీసుకు వచ్చిన ఫౌండేషన్ చైర్మన్ ఘంటా మధుకృష్ణను ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు అభినందించారు. కార్యక్రమంలో కేరళకు చెందిన పారిశ్రామికవేత్త ఫిలిప్స్ థామస్, మద్దిపాటి వెంకట్రాజు, రాష్ట్ర క్రీడల కార్యదర్శి ఎం.శ్రీకాంత్, దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు, మద్దిపాటి సతీష్‌బాబు, కొర్లపాటి శ్రీరామచంద్రరావు, దుగ్గిరాల రమేష్ బాబు, పలువురు కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన క్రికెట్ టోర్నీ

సంక్రాంతి సంబరాల్లో భాగంగా వారం రోజులుగా వేళ్లచింతలగూడెంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు సోమవారంతో సెమీ ఫైనల్స్‌కు చేరాయని నిర్వాహకుడు కొర్లపాటి రాజా తెలిపారు. ఈనెల 13న ఫైనల్స్ నిర్వహిస్తామని తెలిపారు.

పోరంబోకు భూములు పంచాలంటూ ధర్నా

కొవ్వూరు: నల్లజర్ల మండలం, అనుమునిలంక గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ కొండ పోరంబోకు భూమిని తమకు పంపిణీ చేయాలని కోరుతూ ఆ గ్రామ పేద దళిత రైతులు సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆ భూములను స్థానిక సర్వేయర్‌తో కాకుండా జిల్లా సర్వేయర్‌తో కొలిపించాలని నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ గ్రామంలోని భూమి లేని పేదలు సాగు చేసుకుంటున్న ఆ భూములకు వైఎస్సార్ భూ పంపిణీ, జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద పట్టాలు ఇవ్వాలని కోరారు. రెవెన్యూ అధికారులు చేస్తున్న సర్వేపై సాగుదారులు సంతృప్తికరంగా లేరన్నారు. అనంతరం ఆర్డీవో ఎస్.మల్లిబాబుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందరబాబు, చేబత్తుల వెంకట నరసమ్మ, చొతులూరి మరియమ్మ, చేబత్తుల సత్యం, మంగమూరి సరోజిని, కాకర్ల భూలక్ష్మి తదితరులు ఆందోళనకు సారథ్యం వహించారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన చిన్నారులు

కొవ్వూరు: తప్పిపోయిన కవల పిల్లలు సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేరారు. సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వేములూరు గ్రామానికి చెందిన తోట యుమున, మహేంద్ర దంపతుల ఐదేళ్ల వయసున్న మగ కవల పిల్లలు సోమవారం దారి తప్పి టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారని తల్లి తొలుత భావించింది. అక్కడ ఆరా తీయగా రాలేదని తేలడంతో వారి ఆచూకీ కోసం తల్లిదండ్రులు వెతుకులాట మొదలు పెట్టారు. నడుచుకుంటూ టోల్‌గేట్ జంక్షన్ వద్దకు చేరుకున్న అక్షయ్‌కుమార్, అభయ్‌కుమార్ అనే ఆ కవలలను అక్కడి ఆటో డ్రైవర్లు చేరదీశారు. వివరాలు చెప్పలేకపోవడంతో వారిని పట్టణ పోలీసులకు అప్పగించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు, సిబ్బంది ఆ పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు.

జగన్ పాదయాత్ర జ్ఞాపకాలు పదిలం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ప్రకాశరావుపాలెంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన ప్రజాసంకల్ప పాదయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని ప్రకాశరావుపాలెంలో ముత్తిన నరేష్ ఇంటి వద్ద ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ సాగిన ప్రజా సంకల్పయాత్ర జ్ఞాపకాలను తలారి గుర్తు చేసుకున్నారు. అప్పటి ప్రతిపక్ష నేతగా కోట్లాది ప్రజల హృదయాలను జగన్ గెలుచుకున్నారన్నారు. ప్రజల కష్టాలను స్వయంగా చూసిన ఆయన వాటిని తీర్చడానికి హామీ లిచ్చి 97 శాతం అమలు చేశారన్నారు. కార్యక్రమంలో కారుమంచి రమేష్, ముత్తిన పండమ్మ, కరుటూరి అచ్యుత రామయ్య, బంక అప్పారావు, వైఎస్ ఎంపీపీ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులు ఐక్యంగా ఉండాలి

చాగల్లు: గౌడ కులస్తులు ఐక్యతగా ఉండి రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతా కృష్ణారావు అన్నారు. గౌడ సామాజికవర్గ ఆత్మీయ సమ్మేళనం ఊనగట్లలో సోమవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికంగా గౌడ సామాజిక వర్గం వారు ఉన్నారన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకుని రాజకీయ పార్టీలు గౌడ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా గౌడ సంఘం యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

డాక్యుమెంట్స్ పోయినవి

తోగుమ్మి నుండి రాజమండ్రి మార్గంలో ది. 05-01-2023న R.S.No.259/2, Plot No.A/20, ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్ పడిపోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు కాల్ చేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

ఆర్.శారద
95500 37452

లింకు దస్తావేజులు పడిపోయినవి

కట్టా విజయలక్ష్మి w/o వెంకటేశ్వరరావు అను నేను తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో గల విద్యానగర్ నుండి శ్రీ కోటసత్యనగర్‌కు ది.15-12-2022 తేదీన ఇల్లు మారుతుండగా నాకు చెందిన దస్తావేజులు నెం. 6924/2012,1459/2014 నెంబర్లు గల 2 లింకు దస్తావేజులు ఒరిజినల్ మార్గమధ్యములో పడిపోయినవి. కావున దొరికిన వారు దయచేసి ఈ క్రింది ఫోన్ నెంబర్లుకు తెలియపరచగలరు

సెల్ : **8143336669**
9160597356

ప్రకటన

నా క్లయింటు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం కాపురస్తులు లేటు బోణంకి అప్పల స్వామి గారి కుమారుడు శ్రీ బోణంకి కృష్ణ మరియు వారి కుమారుడు శ్రీ బోణంకి వెంకట ఉమా మహేశ్వర శ్యామలరావు అను వారలు ఏలూరు అడి షనల్ సీనియర్ సివిల్ జడ్జి వారు ఓ.ఎస్.నె.59/2007 అను దావాలో ది.30-10-2019వ తేదీన యిచ్చిన డిక్రీ జడ్జిమెంట్‌ను ఛాలెంజ్ చేస్తూ పశ్చిమ గోదావరి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి వారి కోర్టులో ఎ.ఎస్. నెం.14/20 నెంబరుగా అప్పీలు చేసినారు. సదరు అప్పీలు గ్రంథములో 4వ రెస్పాండెంట్ అయిన లేటు దగ్గు ఎర్రయ్య గారి కుమారుడైన శ్రీ దగ్గు వెంకటేశ్వర రావుకు ఎన్నిసార్లు నోటును పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కాబట్టి సదరు దగ్గు వెంకటేశ్వరరావు గారికి తెలియ చేయునది ఏమనగా ది.23-01-2023వ తేదీ ఉదయం గం 10.30 ని.లకు సదరు కోర్టు వారి ముందు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా కాని హాజరు అయ్యి ఆక్షేపణలు ఏమైన ఉంటే తెలియ చేయవలెను. లేని యెడల కోర్టు వారు తదుపరి చర్యలు తీసుకొనుదురియూ మరియు తమ యొక్క అబ్సెన్స్‌లో సదరు అప్పీలు గ్రంథము తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియ చేయడమైనది.

ఏలూరు
తేదీ 09-01-2023

ఎస్.వి.ఆర్.గాంధీ
అడ్వకేట్



